శనివారం 22-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 372, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## కొత్త నేర చట్టాలను అమలు చేయకండి

### ప్రధాని మోడీకి మమతా బెనర్జీ లేఖ

ముందడుగు జాతీయం:
దేశంలో కొత్తగా రూపొందించిన 3 నేర చట్టాల అమలును వాయిదా వేయాలని కోరుతూ ప్రధాని మోదీకి బెంగాల్ సీఎం మమతా బెనర్జీ లేఖ రాశారు. వాస్తవానికి జూలై ఒకటో తేదీ నుంచి కొత్త చట్టాలు అమలులోకి రానున్నాయి. అయితే వాటి అమలును వాయిదా వేయాలని కోరూతూ దీదీ లేఖ రాశారు. కొత్త నేర చట్టాలను వాయిదా వేయడం వలన.. పార్లమెంట్‌లో ఆ చట్టాలను సమీక్షించే అవకాశం ఉంటుందని ఆమె తన లేఖలో అభిప్రాయపడ్డారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య చట్టాలను కేంద్ర ప్రభుత్వ ఇటీవల ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే బ్రిటీష్ కాలం నాటి భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, 1872 నాటిఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకువచ్చారు. దేశ పౌరులకు వేగవంతంగా న్యాయం అందించాలన్న ఉద్దేశంతో ఆ కొత్త చట్టాలను రూపొందించారు. న్యాయ వ్యవస్థను, కోర్టు మేనేజ్మెంట్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కొత్త చట్టాలను తయారు చేశారు.

# రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ

- కాంగ్రెస్ పార్టీ మాట చెబితే శిలా శాసనం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



ముందడుగు హైదరాబాద్:
తెలంగాణలో రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ.. ఏదైనా మాట చెబితే అది శిలా శాసనం. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొని నిలబడి.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం మా నాయకుల గొప్పతనం.. కమిట్ మెంట్. 2022 మే 6 వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ రుణమాఫీ హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని కేబినెట్ మిగతా 2లో



**ఎత్తయిన పర్వతంపై సైనికులు యోగాసనాలు**

వివరాలు 2లో



**రేప్, అక్రమ సంబంధాల్లో అబార్షన్‌కి చట్టం..**

వివరాలు 3లో



**ఎక్కువ విటమిన్ల ఆహారం తీసుకుంటాను**

వివరాలు 3లో



**గోవాలో ఈ బీచ్ వెళ్లాలంటే రిజర్వేషన్**

వివరాలు 4లో

## రూ.300 కోట్ల మైనింగ్ అక్రమాలు జరిగాయి

- మైనింగ్ పేరుతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అక్రమాలు
- పలు విషయాలు వెల్లడించిన ఈడీ



ముందడుగు హైదరాబాద్:
బిఆర్ఎస్ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి .. మైనింగ్ వ్యవహారంలో ప్రభుత్వానికి రూ.39కోట్లు నష్టం చేకూర్చినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గుర్తించారు. మొత్తం రూ.300 కోట్ల మైనింగ్ అక్రమాలు జరిగినట్టు అధికారులు నిర్ధరణకు వచ్చారు. సంతోష్ శాండ్, మిగతా 2లో



## హజ్ యాత్రలో 98 మంది భారతీయులు మృతి

### శుక్రవారం కేంద్ర ప్రభుత్వం వెల్లడి

ముందడుగు జాతీయం:
హజ్ యాత్రకు వెళ్లిన యాత్రికులు విపరీతమైన వేడి కారణంగా ప్రాణాలు వదులుతున్నారు. సౌదీ అరేబియా ప్రభుత్వం ప్రకారం ఇప్పటి వరకు మరణాల సంఖ్య 1000ని మిగతా 2లో

ముందడుగు
శనివారం, 22-6-2024, హైదరాబాద్

## రూ.300 కోట్ల మైనింగ్ అక్రమాలు జరిగాయి

మొదటిపేజీ తరువాయి

సంతోష్ గ్రానైట్ కంపెనీల ద్వారా ఈ అక్రమాలు జరిగాయని ఈడీ పేర్కొంది. మైనింగ్ పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన మహిపాల్‌రెడ్డి సోదరుల నివాసాల్లో సోదాల సమయంలో ఈడీ రూ.19లక్షల నగదు గుర్తించింది. సోదాలకు సంబంధించి శుక్రవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. మనీలాండరింగ్, హవాలా నేపథ్యంలో సోదాలు నిర్వహించినట్టు తెలిపింది. బ్యాంకు ఖాతాల్లో కూడా అక్రమ లావాదేవీలను గుర్తించింది. అక్రమ మార్గంలో డబ్బు మొత్తాన్ని స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టారని ఈడీ వివరించింది. బినామీ పేర్లతో లావాదేవీలను గుర్తించామని, మరి కొన్ని బ్యాంకు లాకర్లను తెరవాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. మహిపాల్‌రెడ్డి సోదరులకు పలువురు బినామీలుగా ఉన్నట్టు దర్యాప్తులో తేలిందని తెలిపారు.

# కేజ్రీవాల్ బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే

### ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఈడీ ▪ విచారణ పూర్తయ్యే వరకు నో బెయిల్

ముందడుగు ఢిల్లీ:

మద్యం పాలసీకి సంబంధించి మనీలాండరింగ్ కేసులో అరవింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లేందుకు బెయిల్ ఉత్తర్వులపై 48 గంటల పాటు నిలుపుదల చేయాలన్న ఈడీ అభ్యర్థనను ప్రత్యేక జడ్జి నియయ్ బిందు గురువారం



తిరస్కరించారు. రూ.లక్ష వ్యక్తిగత బాండ్ పూచీకత్తుపై కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. అయితే, ట్రయల్ కోర్టు తీర్పును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేజ్రీవాల్ బెయిల్‌పై హైకోర్టులో సవాల్ చేసింది. ఈడీ తరపు న్యాయవాది ఏఎస్‌జీ ఎస్వీ రాజు వాదించారు. కేజ్రీవాల్ బెయిల్ దరఖాస్తును వ్యతిరేకించేందుకు దర్యాప్తు సంస్థకు పూర్తి అవకాశం ఇవ్వలేదని హైకోర్టుకు తెలియజేశారు. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కోరారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై స్టే విధించింది. ఈడీ పిటిషన్‌పై విచారణ పూర్తయ్యే వరకూ బెయిల్ మంజూరు చూయకూడదని తేల్చి చెప్పింది.

# రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ

మొదటిపేజీ తరువాయి

నిర్ణయించింది.
తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం 2014, 2018లో రుణమాఫీ చేసింది. మొదటిసారి రూ.16వేల కోట్లు, రెండో సారి రూ.12వేల కోట్లు రుణమాఫీ చేసింది. అప్పటి ప్రభుత్వం 2018 డిసెంబరు 11 కటాఫ్ తేదీగా నిర్ణయించింది. మా ప్రభుత్వం 2018 డిసెంబరు 12 నుంచి మొదలు పెట్టి.. 2023 డిసెంబరు 9 వరకు కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుంది. ఐదేళ్ల మధ్య కాలంలో ఈ రాష్ట్రంలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. రుణమాఫీతో 47 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం వేశాం. జులై 15లోపు ఉప సంఘం నివేదిక ఇస్తుంది. ఆ నివేదిక ఆధారంగా రైతు భరోసా విధివిధానాలు ఖరారు చేస్తాం. రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు అవసరమని అంచనా వేశాం. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వ నిర్ణయాలను ఇకపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందిస్తారు'' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# కవిత జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

### జులై 7వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ



ముందడుగు ఢిల్లీ:

సీబీఐ ప్రత్యేక కోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఎదురుదెబ్బ తగిలింది. లిక్కర్ పాలసీ పై సీబీఐ దాఖలు చేసిన కేసులో కవితకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను వర్చువల్గా కోర్టు ముందు అధికారులు హాజరుపరిచారు. జులై 7వరకు కస్టడీ పొడిగిస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

కవిత బెయిల్ కోసం ఆమె తరపు న్యాయవాదులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కనీసం మధ్యంతర బెయిల్ కూడా దక్కలేదు. బీఆర్ఎస్ పార్టీ న్యాయ విభాగం కూడా శ్రమిస్తోంది. ఇటీవల కవిత కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. ఆమెకు బెయిల్ లభించలేదు. తనను అక్రమంగా అరెస్టు చేశారని.. ఇది మనీలాండరింగ్ కేసు కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసని అప్పట్లో కవిత చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఇప్పుడు ఆమె కస్టడీని కూడా కోర్టు పొడిగిస్తూ వస్తోంది.



# ఎత్తయిన పర్వతంపై సైనికులు యోగాసనాలు

### పిర్‌పంజాల్ పర్వతశ్రేణిపై ఆకట్టుకున్న ఆసనాలు

ముందడుగు జాతీయం:

జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రపంచ దేశాలన్నీ ఘనంగా జరుపుకున్నాయి. మన దేశంలో కూడా తెల్లవారుజామునే పలు ప్రాంతాల్లో రకరకాల యోగాసనాలు వేసి యోగా డే సెలబ్రేట్ చేసుకున్నారు. ప్రధాని నరేంద్రమోదీ సహా అన్ని రంగాలకు చెందిన వారు ఈ యోగా డేలో పాల్గొన్నారు. భారత సైనికులు ఎక్కడికక్కడ యోగా డే జరుపుకున్నారు. ఎత్తయిన పిర్‌పంజాల్ పర్వతశ్రేణిపై సైనికులు యోగాసనాలు వేశారు ప్రధాని నరేంద్రమోడీ చొరవతో 2015 నుంచి ప్రతి ఏడాది జూన్ 21న అంతర్జాతీయ యోగా డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఏడాదిలో ఒక్కరోజు యోగా డే జరుపుకోవాలన్న ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపాదనకు 2014 సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితిలోని 193 దేశాలు ఆమోదం తెలిపాయి. దాంతో 2015 నుంచి జూన్ 21 యోగా డే అంతర్జాతీయ యోగా డే నిర్వహిస్తున్నారు. ప్రధాని మోడీ జమ్ముకశ్మీర్‌లోని దాల్ సరస్సు ఒడ్డున జరిగిన యోగా డే వేడుకల్లో పాల్గొన్నారు.

# హజ్ యాత్రలో 98 మంది భారతీయులు మృతి

### శుక్రవారం కేంద్ర ప్రభుత్వం వెల్లడి

మొదటిపేజీ తరువాయి

దాటింది. ఎక్కువగా ఈజిప్టు దేశానికి చెందిన వారే ఉన్నారు. ఈ దేశానికి చెందిన వారు 600కి పైగా ఉన్నారు. ఇదిలా ఉంటే హజ్ యాత్రలో 98 మంది భారతీయులు మరణించినట్లు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అన్ని మరణాలు కూడా "సహజ కారణాల" వల్లనే చోటు చేసుకున్నట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఈ ఏడాది ఇప్పటి వరకు 1,75,000 మంది భారతీయులు హజ్ యాత్ర కోసం సౌదీకి వెళ్లినట్లు ప్రభుత్వం తెలిపింది. అక్కడికి వెళ్లిన భారతీయుల కోసం చేయగలిగిందంతా చేస్తున్నామని చెప్పింది. ఇస్లాం 5 నియమాల్లో ఒకటైన హజ్ యాత్ర కోసం యాత్రికులు సౌదీకి వెళ్తుంటారు. ఇస్లాం ప్రకారం, ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలి. ఈ ఏడాది సౌదీలో వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వారం అక్కడ ఉష్ణోగ్రత ఏకంగా 51.8 డిగ్రీలకు చేరుకుంది. తీర్థయాత్ర కోసం గంటల తరబడి ఎండలో నడవడం, ప్రార్థనలు చేయడంతో చాలా మంది అస్వస్థతకు గురై ప్రాణాలు వదిలినట్లు తెలుస్తోంది.

ముందడుగు
శనివారం, 22-6-2024, హైదరాబాద్

# రేప్, అక్రమ సంబంధాల్లో అబార్షన్‌కి చట్టం..

## ఇస్లామిక్ దేశం యూఏఈ సంచలన నిర్ణయం

ముందడుగు జాతీయం:

అత్యాచారం వివాహేతర సంబంధం వల్ల గర్భం దాల్చిన మహిళ, గర్భవిచ్ఛిత్తికి ఇస్లామిక్ దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) కొత్త చట్టం తీసుకువచ్చింది. అత్యాచారం లేదా అక్రమ సంబంధం విషయాన్ని బాధితులు తక్షణమే అధికారులకు నివేదించాల్సి ఉంటుంది. దాన్ని నిరూపించే నివేదికను పబ్లిక్ ప్రాసిక్యూటర్ నుంచి తీసుకురావాలని తీర్మానం పేర్కొంది. మహిళల ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకుని 120 రోజుల్లోపు గర్భాన్ని మాత్రమే తొలగించేందుకు ప్రభుత్వం అనుమతి కల్పిస్తుంది. ఇదిలా ఉంటే యూఏఈలో కనీసం ఏడాది ఉన్న మహిళలకు మాత్రమే ఈ కొత్త నిబంధన వర్తిస్తుంది.




యూఏఈ చట్టాల్లో ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిని శిక్షించడానికి చట్టాలు ఉన్నాయి. అయితే, మహిళలకు ఈ నేరాల వల్ల ఎదురయ్యే గర్భధారణ సమస్యను పరిష్కరించేందుకు చట్టాలు కావాలని అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈ నేరాలకు పాల్పడిన వారికి యూఏఈ చట్టం ప్రకారం యావజ్జీవ శిక్ష విధిస్తారు. ఒక వేళ అమ్మాయి 18 ఏళ్ల లోపు ఉంటే, దివ్యాంగురాలు అయితే మరణశిక్ష విధిస్తారు. ప్రస్తుతం యూఏఈ ప్రవేశపెట్టిన తీర్మానం అధికార గెజిట్‌లో ప్రకటించిన తర్వాత అమలులోకి వస్తుంది. మహిళల హక్కులను ప్రాధాన్యత ఇస్తూ, ఛాందసవాద చట్టాలను మార్చే పనిలో యూఏఈ ఉంది. కొత్త చట్టం మహిళల ఆరోగ్యం, సమానత్వానికి ప్రతీకగా నిలువబోతోంది.

# హోంమంత్రి ఏర్పాటుకు చొరవ తీసుకోండి

## గవర్నర్ కు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వినతి

ముందడుగు హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నెలలు గడుస్తున్న ఇప్పటివరకు హోంమంత్రిని నియమించలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనడానికి వరుసగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, హింసాయుత ఘటనలే నిదర్శనమని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ తెలంగాణ గవర్నర్ వినతి పత్రం అందజేశారు. గడిచిన వారం రోజుల్లో నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో అందరూ చూస్తుండగా సంజీవ్ అనే వ్యక్తిని కర్రలతో కొట్టి చంపారు. హైదరాబాద్ నడిబొడ్డున బాలాపూర్ లో అందరూ చూస్తుండగా సమీర్ అనే యువకుడిని దారుణంగా పొడిచి చంపారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన జరిగింది. రక్షించాల్సిన పోలీసే, తోటి మహిళా కానిస్టేబుల్ పై అత్యాచారం. హైదరాబాద్ నగరంలో ఎన్నో నేర సంఘటనలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఇకమీదట ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలు కాపాడాలి. రాష్ట్రానికి హోంశాఖ మంత్రి


YOUTH FOR ANTICORRUPTION

Date: 21/06/2024

To,

The Secretary to Governor,
Raj Bhavan, Telangana,
Hyderabad-500041

Dear Sir/ Madam,

Sub: రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనేటందుకు వరుసగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, హింసాయుత ఘటనలే నిదర్శనం.

గడిచిన వారం రోజుల్లో నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో అందరూ చూస్తుండగా సంజీవ్ అనే వ్యక్తిని కర్రలతో కొట్టి చంపారు.

హైదరాబాద్ నడిబొడ్డున బాలాపూర్ లో అందరూ చూస్తుండగా సమీర్ అనే యువకుడిని దారుణంగా పొడిచి చంపారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన మరచిపోక ముందే, మరో దారుణం చోటుచేసుకున్నది. రక్షించాల్సిన పోలీసే, తోటి మహిళా కానిస్టేబుల్ ను భక్షించే దుర్ఘటన నిన్న భూపాలపల్లి జిల్లాలో జరగడం అత్యంత హేయమైన చర్య. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రభుత్వం తక్షణం స్పందించి కారకుడైన ఎస్సై పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ఇకమీదట ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలు కాపాడాలని కోరుతున్నాం.

లేకపోవటం, శాంతి భద్రతలపై సమీక్షలు లేకపోవటం కూడా ప్రధాన కారణమని తెలంగాణ గవర్నర్ అందజేసిన వినతిపత్రంలో కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కార్యదర్శి కొన్నె దేవేందర్, బత్తిని రాజేష్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.


## మరో వివాదంలో ఐఏఎస్ అధికారిణి

# రోహిణి సింధూరి

### భూమిని ఆక్రమించారని బాలీవుడ్ సింగర్ ఫిర్యాదు ■ ఎక్స్ ఖాతాలో ఫిర్యాదు కాపీ పోస్ట్

ముందడుగు జాతీయం:

తన భూమిని ఆక్రమించారని ఆరోపిస్తూ కర్ణాటక క్యాడర్‌కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరిపై బాలీవుడ్ గాయకుడు లక్కీ అలీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు కాపీని ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. బెంగళూరు శివారులోని యెలహంక ప్రాంతంలో తన వ్యవసాయ భూమిని ఐఏఎస్ రోహిణి, ఆమె భర్త సుధీర్ రెడ్డి, బంధువు మధుసూదన్ రెడ్డి అక్రమంగా లాక్కొన్నారని లక్కీ అలీ ఆరోపించారు. ఇందుకు కొందరు స్థానిక పోలీసు అధికారులు ఆమెకు సాయం చేసినట్లు తెలిపారు. 2022లోనే దీనిపై తాను కేసు పెట్టినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అందుకే తాను






లోకాయుక్త పోలీసులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. గాయకుడి ఫిర్యాదుతో యెలహంక న్యూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతేడాది ఐపీఎస్ రూపా మౌద్గిల్‌తో వివాదంతో ఐఏఎస్ రోహిణి సింధూరి వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. రోహిణి వ్యక్తిగత చిత్రాలను బయటపెడుతూ ఐపీఎస్ రూప చేసిన ఆరోపణలు.. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ముందు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. రూప ఆరోపణలకు రోహిణి కూడా సోషల్ మీడియాలో దీటుగా స్పందించారు. తనకు వ్యతిరేకంగా ఆరోపణలు చేసి, సామాజిక మాధ్యమంలో పోస్టులు పెట్టిన రూప తనకు క్షమాపణలు చెప్పాలని, దాంతో పాటు రూ.కోటి ఇవ్వాలని రోహిణి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం కాస్త తీవ్ర దుమారం రేపడంతో అప్పటి ప్రభుత్వం వీరిపై చర్యలు తీసుకుంది. వీరిద్దరికీ ఎలాంటి పోస్టులు కేటాయించకుండా బదిలీ వేటు వేసింది.

# ఎక్కువ విటమిన్ల ఆహారం తీసుకుంటాను

- మెదడు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి
- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్

ముందడుగు జాతీయం:

విటమిన్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకుంటానని అదే తన ఆరోగ్య రహస్యమని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ చెప్పారు. ఆరోగ్యాన్ని కాపాడుకునే విషయంలో యువ పారిశ్రామికవేత్తలకు ఆయన కొన్ని సూచనలు చేశారు. జెరోదా సంస్థ సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌తో నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. కార్యకలాపాల్లో తలమునకలై ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదని, తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల శరీరంలో ఏవైనా సమస్యలు తలెత్తితే ముందుగానే గుర్తించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. తాను ఎక్కువగా విటమిన్లు తీసుకుంటానని, దీనివల్ల ఎలాంటి ప్రతికూలతలు ఉండబోవని చెప్పారు. ఈ సందర్భంగా గ్రెయిల్ టెస్ట్ ఆవశ్యకతను వివరించారు.



ఈ పరీక్షతో క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించేందుకు వీలుపడుతుంది. డీఎన్ఏ జన్యువులను సూక్ష్మంగా పరిశీలించడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. ఆరోగ్యం గురించి బిల్‌గేట్స్ తరచూ ప్రస్తావిస్తుంటారు. బయటకు కనిపించే ఆరోగ్యం మాత్రమే ప్రధానం కాదని, మెదడు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని ఆయన చెబుతుంటారు. కంటినిండా నిద్రపోయినప్పుడే మెదడు ఆరోగ్యం మెరుగుపడుతుందని అంటారు. యుక్త వయసు నుంచే ఎక్కువ సేపు నిద్రపోవడం అలవర్చుకోవాలని, మలివయసులో దాని ప్రభావం కచ్చితంగా ఉంటుందని వివరిస్తుంటారు. న్యూరో సైంటిస్ట్ మ్యాథ్యూ వాకర్ రాసిన 'వై వి స్లీప్' పుస్తకం ద్వారా నిద్ర గురించి తనకు ఎన్నో విషయాలు తెలిశాయని గతంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో గేట్స్ ప్రస్తావించారు. ఆరోగ్యంగా ఉండాలంటే రాత్రిపూట కచ్చితంగా 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలని, తాను కూడా దీన్నే అనుసరిస్తున్నానని చెప్పారు.

ముందడుగు
శనివారం,
22-6-2024,
హైదరాబాద్




## జూన్ 28న 'ఐఐఐడి డిజైన్ షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2024'

ముందడుగు హైదరాబాద్:

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ ఇంటీరియర్ డిజైనర్స్, హైదరాబాద్ చాప్టర్‌లోని ఆర్కిటెక్ట్‌లు మరియు ఇంటీరియర్ డిజైనర్లచే నిర్వహించబడిన ఎక్స్‌పో ప్రత్యేకంగా ఇంటీరియర్ డిజైన్, ఆర్కిటెక్చర్ ప్రదర్శన హైదరాబాద్ లో నిర్వహిస్తున్నారు. పరిశ్రమ నిపుణులను మరియు సామాన్యులను ఒకే వేదికపైకి తీసుకురావాలని లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగనుంది. హైదరాబాద్ రీజినల్ చాప్టర్, దాని ప్రతిష్టాత్మక ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ "ఐఐఐడి షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్ 2024" ఐదవ ఎడిషన్‌ను డిజైన్ ఇంటెలిజెన్స్ థీమ్‌తో 28వ తేదీ నుండి జూన్ 2022 జూన్ 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనుంది. ఈ ఎగ్జిబిషన్‌ను 2024 జూన్ 28వ తేదీ ఉదయం 11.00 గంటలకు తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారు. ఆర్.సరోష్ వాడియా, జాతీయ అధ్యక్షుడు, ఐఐఐడి గౌరవ అతిథిగా పాల్గొంటారు. సాయంత్రం జరిగే ఫెలోషిప్ సమావేశంలో జోహన్నెస్‌బర్గ్, దక్షిణాఫ్రికా మరియు ఆర్‌కి చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ పీటర్ రిచ్ కీలక ప్రసంగం చేస్తారు. హెచ్ఐసిసిలో లోటస్ ఆర్కిటెక్ట్స్ నుండి సిద్ధార్థ్ తల్వార్ కు జూన్ 29న సన్మాన కార్యక్రమం జరగనుంది.

## భారత సైన్యంతో నవయోగ అకాడమీలో యోగా దినోత్సవ వేడుకలు



ముందడుగు హైదరాబాద్:

నార్సింగిలోని హనుమాన్ మందిర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ప్రత్యేక అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు, హైదరాబాద్‌లోని ప్రముఖ యోగా సంస్థ నవయోగ అకాడమీ, 17వ బెటాలియన్ భారత సైన్యంతో కలిసి ప్రత్యేక అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గోల్కొండ బెటాలియన్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్ పర్సన్ హేమాంజలి బడోని పాల్గొన్నారు. 500 మందికి పైగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆర్మీ సిబ్బంది మరియు వారి కుటుంబాలలో శారీరక మరియు మానసిక శ్రేయస్సును ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యం అని నవ యోగ వ్యవస్థాపకులు కొల్లి నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ సిబ్బంది మరియు వారి కుటుంబాల అవసరాలకు అనుగుణంగా యోగా సెషన్‌లు నిర్వహించారు. నవయోగ యొక్క అనుభవజ్ఞులైన బోధకులు పాల్గొన్నవారికి మార్గనిర్దేశం చేశారు.

# గోవాలో ఈ బీచ్ వెళ్లాలంటే రిజర్వేషన్

- పర్యాటకుల నుంచి అదనపు పన్ను వసూలు
- ఉత్తర గోవాలోని కలంగుట్ పంచాయతీ చర్యలు

ముందడుగు గోవా:

చాలామంది గోవాకు సేద తీరడానికి వెళ్తారు. దేశ, విదేశాల నుండి కూడా ఎంతో మంది గోవాకు వస్తుంటారు. అయితే గోవాలో పర్యాటకుల తాకిడితో తలెత్తుతున్న సమస్యలను కట్టడి చేయడానికి ఉత్తర గోవాలోని కలంగుట్ పంచాయతీ చర్యలు చేపట్టింది. రిజర్వేషన్లు లేకుండా అక్కడికి వచ్చి గ్రామ పరిసరాలను చెత్తగా మారుస్తున్న పర్యాటకులను కట్టడి చేయడమే లక్ష్యంగా పెట్టుకొంది. ఇందుకోసం వారి నుంచి అదనపు పన్ను వసూలు చేయాలని నిర్ణయించుకొంది.

### పరిశుభ్రత కోసం

కలంగుట్‌లో ఈనెల మొదట్లో జరిగిన పంచాయతీ మీటింగ్‌లో దీనిపై చర్చించారు. పబ్లిక్ న్యూసెన్స్, చెత్త వేయడం, ఇష్టారాజ్యంగా పార్కింగ్, బహిరంగ ప్రదేశాల్లో వంట చేయడం వంటి అంశాలపై చర్చించారు. "పర్యటకులు బృందాలుగా బస్సులు, జీపుల్లో వస్తుంటారు. వారు సముద్ర తీర పరిసరాల్లో మద్యం తాగుతున్నారు. అక్కడే వాహనాల్లో వంటలు చేసుకొని చెత్తను ఆ గ్రామ పరిసరాల్లో పారేస్తున్నారు. ఇక్కడ ఉండటానికి వారు హోటళ్లలో ఎలాంటి రిజర్వేషన్లు చేసుకోవడం లేదు. అందుకే గ్రామానికి వచ్చే ఐదు మార్గాల్లో చెక్‌పాయింట్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించాము. రిజర్వేషన్లు లేకుండా వచ్చే రోడ్ ప్యాసింజర్‌పై పన్ను విధించాలని తీర్మానించాం. వారి బాధ్యతారాహిత్య ప్రవర్తనను నియంత్రించడానికే ఈ నిర్ణయం తీసుకొన్నాం" అని గ్రామ సర్పంచి జోసఫ్ సెకీరియా పేర్కొన్నారు. పర్యటకులు మద్యం తాగిన సీసాలను ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నారన్నారు. రోజు మొత్తం అక్కడే వాహనాలను నిలిపి ఉంచడం, పబ్లిక్ టాయిలెట్లు వాడుకోవడం వంటివి సమస్యాత్మకంగా మారాయని పంచాయతీ తీర్మానంలో పేర్కొన్నారు.

### పోలీసులతో చెక్ పోస్టులు

ఇప్పటికే పర్యటకులు గ్రామంలోకి వచ్చే ఐదు మార్గాలను పంచాయతీ సిబ్బంది గుర్తించినట్లు వెల్లడించారు. ఈ మార్గాల్లో పోలీసులతో చెక్ పోస్టులు ఏర్పాటుచేయించాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసేందుకు పంచాయతీ పాలకవర్గం ఏర్పాట్లు చేస్తోంది. పంచాయతీ సిబ్బంది కూడా అక్కడ పని చేసేలా సన్నాహాలు చేసింది.



## బోల్డ్ కిచెన్ విప్లవాన్ని రేకెత్తిస్తున్న ఫిలిప్స్ తాజా క్యాంపెయిన్

ముందడుగు హైదరాబాద్:

సాధారణంగా పలు భారతీయ నివాసాలలో పాత, శబ్దం చేసే మిక్సర్ గ్రైండర్‌లు పాడయ్యే వరకు వాటిని వినియోగిస్తూ ఉంటారు. ఈ అంతర్లీన సమస్యను గుర్తిస్తూ, నివాసాలు, వంటగది ఉపకరణాల పరిశ్రమలో ప్రపంచంలో అగ్రగామిగా కొనసాగుతున్న, లెగసీ బ్రాండ్ ఫిలిప్స్ డొమెస్టిక్ అప్లయెన్సెస్‌ను వినియోగదారులకు అందిస్తున్న వెర్సుని, పాత తుప్పపట్టిన మురికి మిక్సర్‌ను ఉపయోగించే అలవాటుకు వీడ్కోలు పలికేందుకు ప్రతి భారతీయుని ఇంటికి కొత్త రూపు తీసుకువచ్చేలా గ్రైండర్లను కొత్త వినూత్న ఎంపికకు అప్‌గ్రేడ్ చేయండి అనే నినాదంతో నూతన వినియోగదారు క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఒక ఆహ్లాదకరమైన మరియు సాపేక్షమైన వీడియో ద్వారా, ఫిలిప్స్ తన విస్తృత శ్రేణి మిక్సర్ గ్రైండర్‌లను ప్రదర్శించింది. వాటి తక్కువ శబ్దం, శక్తివంతమైన పనితీరుతో గణనీయమైన అప్‌గ్రేడ్‌ను అందిస్తుండగా, ఆధునిక, సౌందర్యపరంగా ఆహ్లాదకరమైన డిజైన్‌లకు మద్దతు ఇస్తుంది. దీనితో పాటు, బ్రాండ్ కొత్త మిక్సర్ గ్రైండర్ సిరీస్ హెచ్ ఎల్7713ని విడుదల చేసింది. ఆధునిక భారతీయ గృహాల అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చేలా తయారు చేసిన తన శ్రేణిని ఇది విస్తరిస్తోంది.

ముందడుగు
శనివారం, 22-6-2024, హైదరాబాద్



## నా కెరీర్‌లో చెత్త సెలక్షన్ అంటే ఆ సినిమానే..!

నయనతార కెరీర్‌ని మలుపుతిప్పిన సంవత్సరం 2005. ఎందుకంటే ఆ ఏడాది రెండు బ్లాక్‌బాస్టర్‌లు ఆమెకు దక్కాయి. అందులో మొదటిది 'చంద్రముఖి' కాగా.. రెండోది 'గజనీ'. ఈ రెండు సినిమాల్లో నయనతార సెకండ్ హీరోయినే కావడం గమనార్హం. అయితే.. ఆమెకు గుర్తింపు తెచ్చింది మాత్రం ఈ రెండు సినిమాలే. ఆడియన్స్ అభిప్రాయం కూడా ఇదే.. కానీ నయన్ అభిప్రాయం మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నయన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో చెత్త సెలక్షన్ అంటే 'గజనీ' సినిమానే చెబుతా. ఇప్పటికీ ఆ సినిమా ఎందుకు చేశానా అని బాధపడుతుంటా. చెప్పింది వేరు.. తీసింది వేరు. అప్పట్లో ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అయితే.. అదొక పాఠంగా తీసుకొని తర్వాత నుంచి జాగ్రత్త పడుతున్నాను' అని చెప్పింది. అయితే.. నయన్ మాటలతో కొందరైతే ఏకీభవించడంలేదు. అసలు తనకి పేరు తెచ్చిందే 'గజనీ' సినిమా. ఆ సినిమా గురించి నయన్ అలా మాట్లాడటం తగదని కొందరు అభిప్రాయపడుతున్నారు.


# మీరు రైలు ప్రయాణికులా అయితే ఈ నెంబర్ సేవ్ చేసుకోండి

## అనారోగ్య సమస్యకు తక్షణ పరిష్కారం

ముందడుగు ప్రత్యేకం:
రైలులో ప్రయాణించే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. రైలు ప్రయాణం చేసేటప్పుడు చాలాసార్లు ప్రయాణీకుల ఆరోగ్యం క్షీణించడం జరుగుతుంది. ఆ పరిస్థితిలో వారికి ఏమి చేయాలో అర్థం కాదు. రైలులో ప్రయాణించేటప్పుడు ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే, మీకు అత్యవసర పరిస్థితుల్లో సహాయపడే ఓ నెంబర్ ఉంది. అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం. రైలు వెళ్తున్నప్పుడు అనారోగ్యంగా అనిపిస్తే ఆందోళన చెందాల్సిన పనిలేదు. మీరు 139 నంబర్‌కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం పొందవచ్చు.

### రైల్వే అనేక రకాల సౌకర్యాలను అందిస్తుంది

ఒక ప్రయాణికుడి ఆరోగ్యం క్షీణించిన తరువాత, అతనికి




సకాలంలో వైద్యం అందక మరణించిన సంఘటనలు రైలులో చాలాసార్లు కనిపించాయి. అయితే.. ప్రయాణ సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ప్రయాణికులకు సహాయం చేసేందుకు రైల్వేశాఖ అనేక సౌకర్యాలు కల్పిస్తోంది.

### టీటీఈ సహాయం తీసుకోవచ్చు

139కి కాల్ చేయడమే కాకుండా.. మీరు టీటీఈకి.. మీరు లేదా ఎవరైనా ప్రయాణీకుల అనారోగ్య సమస్యల గురించి తెలియజేయవచ్చు. టీటీఈ దగ్గర ప్రయాణికులకు సంబంధించిన వివరాలు ఉంటాయి. ఈ క్రమంలో.. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందిస్తాడు.

### Xలో సహాయం కోసం అడగవచ్చు

X (Twitter)ని ఎలా ఉపయోగించాలో మీకు తెలిస్తే.. మీరు భారతీయ రైల్వేలు, రైల్వేలు లేదా IRCTCని ట్యాగ్ చేసి, మీ PNR సమాచారాన్ని అందించడం వల్ల సహాయం అడగవచ్చు.

### రైలులో మెడిసిన్ పొందవచ్చు

రైలులో ప్రయాణికుడు అనారోగ్యానికి గురైతే.. మీరు 139కి కాల్ చేసి మెడిసిన్ అడగవచ్చు. 58 కంటే ఎక్కువ రకాల మెడిసిన్స్ అందుబాటులో ఉంటాయి. అంతే కాకుండా.. రైల్వే ప్రయాణికులు డాట్ ఇన్ యాప్‌కి వెళ్లి కూడా సహాయం అడగవచ్చు.



## కలి పురుషుడిపై కల్కి పోరాటం

ఇప్పటివరకూ వచ్చిన భారతీయ సినిమాలన్నీ ఒకెత్తు.. 'కల్కి 2898' ఒకత్తు అనేలా ఉంది శుక్రవారం విడుదలైన ట్రైలర్. 'భగవంతుడి లోపల సమస్త సృష్టి ఉందంటారు.. అలాంటిది, మీ కడుపులో ఆ భగవంతుడే ఉన్నాడు..' అంటూ అశ్వత్థామగా అమితాబ్ చెప్పిన డైలాగ్‌తో ట్రైలర్ మొదలైంది. దైవాన్ని గర్భాన మోస్తున్న దీపికను, ఆమె గర్భస్థ శిశువును కలి బారినుండి కాపాడటమే లక్ష్యంగా పెట్టుకున్న అశ్వత్థామను ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. కలియుగాంతంలో కలి పురుషుని దారుణాలు భరించలేక, మాధవుని ఆగమనం కోసం ఎదురుచూస్తున్న అభాగ్యుల ఆక్రందనలు ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. 'రేపటి కోసం' జనం ఎదురుచూస్తుంటే, 'ఈ రోజును చంపితే రేపెలా ఉంటుంది?' అంటూ కలి పురుషుడు చేసే వికటాట్టహాసాన్నీ, విఫలయత్నాన్నీ ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. 'ఎన్ని యుగాలైనా ఎన్ని అవకాశాలిచ్చినా మనిషి మారడు.. మారలేడు..' అని నిర్ధయం.. నిక్కచ్చిగా చెబుతున్న కలి పురుషుడి విచిత్రరూపంలో కమల్‌హాసన్‌ని ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. ఏదోఒకటి చేసి సకల సౌకర్యాలుండే 'కాంప్లెక్స్'కి వెళ్లిపోవాలని ప్రయత్నించే భైరవ ఎవరు? భైరవకీ అశ్వత్థామకూ మధ్య యుద్ధం ఎందుకొచ్చింది? ఇలా ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమయ్యేలా ఈ ట్రైలర్ ఉంది. మొత్తంగా మన పురాణాలకు హాలీవుడ్ సొగబులద్ది, ఓ కొత్తలోకాన్ని ట్రైలర్‌లో ఆవిష్కరించాడు దర్శకుడు నాగ్‌అశ్విన్. 'ఇప్పటివరకూ ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు.. ఇది కూడా ఓడిపోను..' అనే డైలాగ్ నాగ్‌అశ్విన్ కోసమే రాసినట్టుంది. ప్రభాస్, అమితాబ్, కమల్‌హాసన్, దీపిక పదుకొనే, శోభన, మాళవిక నాయర్.. పాత్రలు ట్రైలర్‌లో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ నెల 27న విడుదల కానున్న పాన్ వరల్డ్ మూవీ 'కల్కి 2898'ను ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే.



## ఆడవాళ్ళని మగాళ్లు ఎందుకు క్యారెక్టర్ లేని వాళ్ళలా చూస్తారు
### : చాందిని చౌదరి

తెలుగు నటి చాందిని చౌదరి ఇండస్ట్రీలో ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతుంది. కలర్ ఫొటోతో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ ఈ ఏడాది ఇప్పటికే మూడు సినిమాలలో నటించింది. ఇప్పటికే చాందిని నటించిన గామి సినిమా విడుదలై మంచి విజయం అందుకోగా రీసెంట్‌గా వచ్చిన యేవమ్, మ్యూజిక్ షాప్ మూర్తి సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు సాధిస్తున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ భామ ఇండస్ట్రీలో ఉన్న మగవాళ్లపై సంచలన పోస్ట్ పెట్టింది. నిజాయితీగా నా దగ్గర నుంచి ఒక ప్రశ్న, నేను చూసిన దాన్ని బట్టి అడుగుతున్నాను, చిత్ర పరిశ్రమలో పని చేసే ఆడవాళ్ళని మగవాళ్ళు ఎందుకు క్యారెక్టర్ లేని వాళ్ళ లాగా చూస్తారు. వాళ్ళు మాట్లాడే ప్రతి మాటలో కూడా ఆడవాళ్ళని తక్కువ చేసి మాట్లాడతారు. ఇది చాలా బాధ కలిగిస్తుంది ఎందుకంటే ఈ ఫీల్డ్‌లో చాలా కష్టపడి పని చేయాల్సి ఉంటుంది. ఇలాంటివి చూసినప్పుడు మనసు విరిగిపోతుందంటూ చాందిని ఎక్స్ వేదికగా రాసుకొచ్చింది. కాగా ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.